క్లుప్తంగా

బాల్యమిత్రుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

మిరుదొడ్డి(దుబ్బాక): మిత్రుడి కుటుంబానికి బాల్యస్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాళ్ళబండి నర్సింహాచారి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు మిత్రుడి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి ఓదార్చారు. రూ.23,500 నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో కండ్లకొయ్య యాదగిరి, వేముల శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, పాపగారి శ్రీనివాస్, తీపిరెడ్డి రాజు, ముక్కపల్లి రాజమల్లు, మర్కంటి ఉమాపతి, గరిపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఏఐసీసీ ప్రకటన హర్షణీయం



భానుప్రకాష్‌రావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణ సీఎం అభ్యర్థిగా రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంపై యువజన కాంగ్రెస్ నియోజక వర్గ మాజీ అధ్యక్షుడు, తిగుల్ గ్రామ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ నిర్ణయం అభినందనీయమన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు లబ్ధిదారులకు అందించేలా తమవంతు కృషి చేస్తానన్నారు. తిగుల్‌లో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. అలాగే అందోల్ ఎమ్మెల్యే దామోదర్ రాజనర్సింహ జన్మదినం సందర్భంగా ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రేవంత్‌రెడ్డికి అభినందనలు



అభినందనలు తెలుపుతున్న కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

నాయకులకు కృతజ్ఞతలు



ఏకానందం

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులకు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏకానందం కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజాతీర్పును స్వీకరిస్తున్నామని, నూతన ఎమ్మెల్యే సహకారంతో చేర్యాల ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే ప్రభుత్వం పథకాలు అర్హులకు అందేలా చేస్తామన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి

హుస్నాబాద్: నూతన ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ అందరి సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ జిల్లా కన్వీనర్ మల్లిరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలు పాల్పడకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే దిశగా పాలన కొనసాగాలన్నారు. ప్రభుత్వ పథకాలల్లో అందజేతలో వివక్ష చూపకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

డిస్క్‌త్రో పోటీలకు విద్యార్థిని ఎంపిక

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జాగృతి డిస్క్‌త్రో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు సర్పంచ్ నర్సింగరావు మంగళవారం తెలిపారు. నవంబర్‌లో సిద్దిపేటలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. దీంతో ఈనెల 7వ తేదీ నుంచి హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాగృతిని సన్మానించి వాచీని బహుమతిగా అందజేశారు.

బీఆర్ఎస్ వైపే కొండపాక ఓటర్లు

- ఎమ్మెల్యే అభ్యర్థి విజయంలో మండల ఓటర్ల మెజార్టీ కీలకం
- కేసీఆర్‌కు 2800 మెజార్టీ
- మెజార్టీ ఇచ్చే గ్రామాలు విలీనం కావడంతో తగ్గిన ఓట్లు
- నాయకుల వైఖరి కూడా కారణమని ప్రచారం



కొండపాకలో క్యూలో నిలుచున్న మహిళా ఓటర్లు (ఫైల్)

కొండపాక(గజ్వేల్): గజ్వేల్ నియోజక వర్గం ఎమ్మెల్యే పదవికి 15 ఏళ్లుగా ఏ పార్టీ నుంచి విజయం సాధించాలన్నా మండల ఓటర్ల మెజార్టీ తీర్పే కీలకంగా మారింది. ఈసారి కూడా విజయం సాధించిన ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్‌కు 2800 ఓట్ల మెజార్టీ ఇచ్చింది. మండలంలో బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీని ఇచ్చే తొమ్మిది గ్రామ పంచాయతీలు నూతనంగా ఏర్పడిన కుకునూరుపల్లి మండలంలో విలీనం కావడంతో మెజార్టీ తక్కువ రావడానికి కారణమని నాయకులు భావిస్తున్నారు. మండలంలోని 15 పంచాయతీల్లో 25,189 మంది ఓటర్లున్నారు. వీరిలో 12,552 మంది పురుషులు, 12,636 మంది మహిళా ఓటర్లున్నారు. ఇందుకుగాను 31 పోలింగ్ స్టేషన్లుగా విభజించారు. మండలంలో బీఆర్ఎస్‌కు 9625, బీజేపీకి 6823, కాంగ్రెస్‌కు 2179 ఓట్లు దక్కాయి. దుద్దెడలో అత్యధికంగా 3364 ఓట్లు పోలవ్వగా బీఆర్ఎస్‌కు 1792 ఓట్లు, గిరాయిపల్లిలో 394కు 313 ఓట్లు వచ్చాయి. బీజేపీకి దుద్దెడ, కొండపాక, మర్పడ్గ గ్రామాల్లో అధికంగా ఓట్లు దక్కగా, బందారంలో బీఆర్ఎస్ కంటే 43 ఓట్లు బీజేపీకి వచ్చాయి. మొదటి నుంచి బీఆర్ఎస్‌కు పట్టున్న మండలంగా పేరున్నప్పటికీ, నాయకుల్లో విభేదాలు కార్యకర్తలు, ప్రజలను అయోమయానికి గురి చేయడంతో మెజార్టీ తగ్గేందుకు కారణమయ్యిందంటూ ప్రచారం సాగుతోంది.

గ్రామాల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్లు

గ్రామాలు	మొత్తం	పోలైనవి	బీజేపీ	బీఆర్ఎస్	కాంగ్రెస్	మెజారిటీ
సిర్సనగండ్ల	3078	2184	718	1146	320	428
గిరాయిపల్లి	394	313	99	180	34	81
మర్పడ్గ	3558	2466	910	1224	332	314
ఖమ్మంపల్లి	1258	952	287	470	195	183
దుద్దెడ	4342	3364	1338	1792	234	454
జప్తినాచారం	1101	686	218	381	87	163
బందారం	1665	1249	576	533	140	-43
అంకిరెడ్డిపల్లి	2319	1766	731	883	189	152
వెలికట్ట	950	662	108	410	144	302
ఆరెపల్లి	898	653	196	393	64	197
కొండపాక	3487	2617	1097	1369	151	272
దమ్మక్కపల్లి	743	591	212	290	79	78
తిమ్మారెడ్డిపల్లి	1396	1097	333	554	210	221

శబరిమలకు అద్దె బస్సులు

గజ్వేల్‌రూరల్: శబరిమలైకి అద్దె ప్రాతిపదికన బస్సులు నడుపుతున్నట్లు జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తుల కోసం శబరిమలకు అద్దె ప్రాతిపదికన ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నామన్నారు. స్వామి దర్శనం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే గుడి దగ్గరకు వెళ్లే అవకాశముంటుందని, గైడ్ చేసేందుకు ఆర్టీసీ ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. అంతేగాకుండా బస్సులో ఒక గురుస్వామితో పాటు ఇద్దరు కన్నె స్వాములు, ముగ్గురు వంట వారికి సీటు లేకుండా ఉచిత ప్రయాణం అనుమతించడం జరుగుతుందన్నారు. స్వాములు బస్సును బుక్ చేసుకున్నట్లయితే గురుస్వామికి రోజుకు రూ.300 చొప్పున ప్రయాణం చేసే రోజుల్లో కమీషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమన్నారు. మరిన్ని వివరాలకు ప్రజ్ఞాపూర్ జీపీపీ ఆర్టీసీ డిపోలో సంప్రదించాలని సూచించారు.

పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు బీరప్ప తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ మంగళవారం బీరప్పను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు చందు, సంతోష్ ఉన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లి గ్రామానికి చెందిన చెలుకల కొండల్‌రెడ్డి బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్ష పదవి, రైతు బంధు గ్రామ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు. పార్టీలో సరైన గుర్తింపులేక పోవడంతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

పశుగ్రాసం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయం వద్దనున్న గోశాలకు దాత మంగళవారం ఎండు పశుగ్రాసం అందజేశాడు. మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్‌గుప్తా పశుగ్రాసం గోశాల నిర్వాహకులకు అందజేశాడు. దాతలు గోశాల అభివృద్ధికి సాయం చేయాలని నిర్వాహకుడు శ్రీనివాస్ కోరారు.

షీ టీంతో రక్షణ

సిద్దిపేటకమాన్: జిల్లాలో షీ టీమ్స్‌తో మహిళలకు రక్షణ, భద్రత కల్పించడం జరుగుతుందని సీపీ శ్వేత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో షీ టీమ్స్‌తో నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నవంబర్‌లో జిల్లాలో 28 మందిపై ఈ పెట్టీ కేసులు నమోదు చేశామని, 43 మందికి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో డివిజన్‌ల వారిగా షీ టీమ్స్ పనిచేస్తున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

నిజాంపేట(మెదక్): నిజాంపేటలోని మండల ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. మంగళవారం తూఫాన్ ప్రభావంతో కురుస్తున్న స్వల్ప వర్షానికే తరగతి గదుల్లోకి నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో శ్లాబు పెచ్చులూ ఊడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పాఠశాలలోని అదనపు గదుల పనులను చేపట్టాలని, శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను తొలగించి నూతన గదులను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

సిద్దిపేటకమాన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పార్టీ అధిష్టానం ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రేవంత్‌ను సీఎంగా ప్రకటించడంతో సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రేవంత్ నాయకత్వంలో రాష్ట్రం ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్క సతీష్‌గౌడ్, అత్తు, తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో ఎమ్మెల్యే పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్లలో కొలువైన సహకార ఆంజనేయస్వామిని మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సునీతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ టీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి గెలుపొందడంపై ఆ పార్టీ నాయకుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు వేర్వేరుగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆమెను కలిసి మిఠాయిలు తినిపించారు.



సునీతారెడ్డిని సన్మానించిన సర్పంచ్ నర్సింలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు చాకరిమెట్లలో సునీతారెడ్డిని కలిసి అభినందనలు తెలిపినట్లు ఆ పార్టీ నాయకుడు ముత్యంగారి ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆమెను కలిసిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ మనోహర్, నాయకులు రాజా గౌడ్, కృష్ణ గౌడ్, పాండరి వెంకటేశం, ప్రభాకర్ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హత్నూర (సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ గ్రామ సమీపంలో సంగారెడ్డి దౌల్తాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. సంగారెడ్డి దౌల్తాబాద్ ప్రధాన రహదారిపై సుమారు 42ఏళ్ల వయసు ఉన్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాల కోసం 8712656752 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్ఐ తెలిపారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి



గుగ్గిల్ల గ్రామ పంచాయతీ వద్ద రిలే దీక్ష చేస్తున్న గ్రామస్తులు

- రిలేదీక్షలో గుగ్గిల్ల గ్రామస్తుల డిమాండ్
- నేడు గ్రామానికి రానున్న డీపీఓ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామశివారులో నిర్మించనున్న గ్రీన్‌వేస్ బయో ఎనర్జీ ఇథనాల్ ఫ్యాక్టరీ పనుల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం గుగ్గిల్ల గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులు చేపట్టిన రిలేదీక్షలో డిమాండ్ చేశారు. గ్రామశివారులోని 559, 561, 557 సర్వే నంబర్‌లో ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఇచ్చిన నో అబ్జక్షన్‌ను (ఎన్‌ఓసీ)ని రద్దుచేసి ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా వినతి పత్రం అందజేశారు. అనంతరం డీపీఓకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారమిచ్చి గ్రామాన్ని సందర్శించాలని కోరారు. ఫ్యాక్టరీ నిర్మాణంతో వాయు, జల, భూ కాలుష్యం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారమివ్వకుండా కొందరు పాలకవర్గ సభ్యులు చేపట్టిన తీర్మానం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎన్ఓసీని రద్దు చేయిస్తామని గతంలో సర్పంచ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ధాన్యపు రాశులకు కవర్ల రక్షణ



రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై కవర్లు కప్పిన దృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): తుఫాన్ ప్రభావం కారణంగా ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు అప్రమత్తమయ్యారు. ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానా అవస్థలుపడుతున్నారు. మండలంలో 20 రోజుల క్రితం వరి కోతలు ప్రారంభించారు. 29 గ్రామాల్లో 12 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. దీంతో 14 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సంబంధిత అధికారులు తెలిపారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్డుపై కుప్పలు పోశారు. అయితే మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో చిరు జల్లులు కురుస్తుండటంతో ధాన్యం తడుస్తోంది. ధాన్యాన్ని దక్కించుకునేందుకు ధాన్యపు రాశులపై కవర్లు కప్పుతున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ నిబంధనల పేరిట ఇబ్బందిపెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి నష్టం వాటిల్లుతుందని, వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

లియో సేవలు అభినందనీయం

సిద్దిపేట ఎడ్యుకేషన్: లియో సంస్థ సేవలు అభినందనీయమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో లియో డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది జన్మించి, మరణిస్తున్నారన్నారు, అందులో కొందరిని మాత్రమే గుర్తుకుంచుకుంటామన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించిన లియోను ప్రపంచం మర్చిపోలేదన్నారు. లియో సభ్యులు తడకమట్ల ఈశ్వరయ్య, ఫణిందర్, జోజి దంపతులు సంస్థ సేవలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

డబ్బుల కోసం రైతుల పడిగాపులు



వెల్దుర్తి బ్యాంక్ ఎదుట చెప్పల క్యూలైన్

వెల్దుర్తి(తూప్రాన్): ఆరుగాలం కష్టించి పండించిన పంట విక్రయించగా వచ్చిన డబ్బులు రైతుల అకౌంట్‌లో జమ అయినా వాటిని విత్‌డ్రా చేసుకోవడానికి రైతులు కష్టాలు పడుతున్నారు. ఇందుకు వెల్దుర్తి సెంట్రల్ బ్యాంక్ ఎదుట కనిపించిన దృశ్యమే చక్కటి నిదర్శనం. అకౌంట్‌లో నుంచి డబ్బులు డ్రా చేసుకోవడం కోసం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఖాతాదారులు (రైతులు) ఉదయం 8 గంటల నుంచే బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. దీంతో క్యూలైన్‌లో ఉండలేక చెప్పులు, బ్యాంక్ పాస్ పుస్తకాలను ఉంచి అధికారుల రాక కోసం ఎదురు చూశారు. ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులను డ్రా చేసుకోవడానికి వెళితే మొత్తం డబ్బులు ఒక్కసారిగా ఇవ్వడం లేదని, ఒక్కోసారి సర్వర్ ప్రాబ్లం అంటూ బ్యాంక్ సిబ్బంది వెళ్లగొడుతున్నారంటూ పలువురు రైతులు ఆరోపించారు.

దేవతలులేని ఆలయాలు

శిథిలావస్థలో ఉన్నా.. పట్టించుకోని వైనం



పూర్తిగా శిథిలమైన ఆలయం

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ బండపై దేవతలు లేని ఆలయాలున్నాయి. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. గ్రామాన్ని ఆనుకొని ఉన్న పెద్ద పరుపుబండపై మూడు ఆలయాలను 80 ఏళ్ల క్రితమే నిర్మించారు. పరుపుబండపై భారీస్థాయిలో కడీరాళ్లతో చూడచక్కగా నిర్మించిన ఈ ఆలయాల్లో ఎందుకనో దేవతలను ప్రతిష్ఠించలేదు. ఇతర ఆలయాలకు భిన్నంగా ఉన్న ఈ ఆలయాలు గత వైభవానికి చిహ్నంగా నిలిచాయి. దేవతలు లేని ఈ ఆలయాల్లో ఎలాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించడంలేదు. కాగా ఈ ఆలయాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను గతంలో ఇతర ప్రాంతాలకు తరలించుకపోయారనే వాదన కూడా వినిపిస్తోంది. వీటికి సంబంధించిన రాళ్లు కొన్ని కిందపడిపోవడంతో ఒక ఆలయం పూర్తిగా శిథిలమైంది. వీటిని సంరక్షించాల్సిన అవసరం ఉంది.

ఆలయాలను పునరుద్ధరించాలి

కోనాపూర్ బండపై జీర్ణస్థితిలో ఉన్న ఈ ఆలయాలను పునరుద్ధరించాలి. ఇక్కడ ప్రతిష్ఠించిన విగ్రహాలను ఇతర ప్రాంతాలకు తరలించారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఈ ఆలయాల్లో దేవుళ్లను ప్రతిష్ఠిస్తే బాగుంటుంది. అలాగే ప్రతీ రోజూ పూజలు జరిగేలా చూడాలి.

– సంజీవరెడ్డి, గ్రామస్తుడు



దేవుడి ప్రతిమలేని ఆలయం